# నెత్తురు చుక్కలు

పరిస్థితులు తారుమారైతే అవస్థాభేదం తప్పదు. అలా తప్పిన ఒక అభాగిని దీనోదంతం యిది.

బొందలపాటి
శివరామకృష్ణ

"పేదా సాదా భేదములేక,
పాడి పంటా ప్రేమతో నొసగి;
పిన్నా పాపా బ్రోచెడుతల్లీ
కష్టముపడినా కడుపేనిండక
కర్షకులంతా క్షోభిస్తుండా
సౌఖ్యంకలుగునె సాకెడుతల్లికి"

అని పాడుకుంటూ ఎవరో బజారేపోతుంటే, ఆ కొంటె పిల్లలు "పిచ్చిది! పిచ్చిది!!" అని కేకలువేసుకుంటూ, రాలు రువ్వుతూ, దుమ్ము చిమ్ముతూ వెంటబడ్డారు. ఇవ్వాళే మొదలు కాదు; మూడురోజులనుండీ చూస్తున్నాను. ఆమె వీధిలో అడుగుపెట్టటం ఆలస్యం— పిల్లలంతా "పిచ్చిది, పిచ్చిది!" అని కేకలువేసుకుంటూ వెంటబడతారు. ఎవరైనా దయగలిగిన పెద్దమనిషి వాళ్లని అదిరించి వెనక్కి త్రిప్పేవరకూ ఆమెవంటిమీద గడ్డలు అట్లా పడుతుండవలసిందే! అదికూడా ఏంపిచ్చిదో అర్థంగావటంలేదు. పిల్లలంతా రాలురువ్వి అట్లాబాధిస్తూంటే వళ్లప్పగించి పాటపట్టుకుని బజారే పోతుందిగాని ఎదురుతిరిగి వాళ్లని అదేమన్నపాపాన పోదు. ఆమె శరీరం రక్తమాంసాలతో ఏర్పడిందో, ఉక్కుముక్కలతో తయారయిందో తెలియటంలేదు. శల్యావశిష్టమైన ఆ సన్నని దేహంలో ఇంత సహనశక్తి ఎట్లా ఇముడ్చుకున్నదో?

ఆమెస్వరంలో మాధుర్యంలేదు. ఆమెపాటలో లాలిత్యంలేదు. ఆమెశరీరంలో సౌందర్యంలేదు. ఆమాధుర్యంలేని కీచుగొంతు ఎవరిని ఆకర్షిస్తుంది? ఆభావంలేనిపాట ఎవరికినచ్చుతుంది? భగవన్నామ సంకీర్తనా కాదు, రామపరాయణమూ కాదు, కృష్ణ లీలలూ కావు. కురూపిరైన ఆమెరూపం, అందంలేని ఆమెవేషం ఎవరిని ఆకర్షిస్తుంది? తిండిలేక శల్యావశిష్టమైనదేహమూ, లోతుకుపోయి అగ్నిగోళాల్లా ప్రజ్వరిల్లుతున్న ఎర్రనికళ్లు. స్త్రీజాతికంతకీ ప్రధానమైనమానమే సరీగ్గా కాపాడలేని జీర్ణవస్త్రమూ, పోషణలేక ముఖానపడ్డ ముంగురులు—ఇదీ ఆమె వేషము, రూపము.

అది ఏంపిచ్చిదో, ఏంబిచ్చపుదో తెలియకుండా వుంది! మాధుర్యం లేని ఆ కీచుగొంతుతో, భావంలేని ఆపాట పట్టుకుపోతుందిగాని, నోరెత్తి ఎవరినీ పిడికెడు భిక్షమడిగినపాపాన పోదు. ఏమి తింటుందో? ఎట్లా బ్రతుకుతుందో? కలియుగకర్ణులూ, కుబేరులు వున్నారని ఆకాశాన్నంటబోతున్న వారిసౌధాలు సూచిస్తూవుంటే, ఇంకెందు కలా డొక్కలెండబెట్టుకొని జీవచ్ఛవంలాగ వారివైపు ఈర్ష్యాదృష్టులతో చూస్తుంది?

పిచ్చిది! పిచ్చిది! ఆమె పిచ్చిదా? కాదు, లోకం పిచ్చిది. పిచ్చిదే అనుకుందాం. అయితే ఆమెను పిచ్చిది అని తిరస్కరించవచ్చునా? పిచ్చి అనేది తిరస్కరించవచ్చునా? పిచ్చి అనేది ప్రతివారిలోనూ వుంటుంది. కొందరిది తెలిసినపిచ్చి. మరికొందరిది తెలియనిపిచ్చి. తెలిసినపిచ్చిని నూత్నసభ్యతయని నెత్తినబెట్టుక విర్రవీగుతారు, తెలియనిదాన్ని, నీచమనీ, అసభ్యత యనీ ఏవగింపుతో దూరంగా పారద్రోలతారు. ఇదెక్కడిన్యాయం? ఇదేమి గ్రుడ్డి ప్రపంచం? ఆమెను పిచ్చిది, పిచ్చిది యని ఏవగించుకుంటున్నారు గాని, ఆపిచ్చిలో ఎంతమంచివున్నదో ఏమి గ్రహించారు? అవును లే! ఆమెస్వరంలో ఈ అంధప్రపంచాన్ని మత్తెక్కించటానికి మాధుర్యంలేదు. ఆమెవేషంలో ఆకర్షణ లేదు. ఆ కీచుగొంతూ, జీర్ణవస్త్రాలూ నవీనసభ్యతకు విరుద్ధాలు. ఇంకా ఈ అంధప్రపంచం ఆమెను ఎందుకు ఆదరిస్తుంది?

బజార్లో పాట వినపడగానే నేను రోజూ బయటికివచ్చి వింటూండేవాణ్ణి. నేనారోజున ఆమె కీచుగొంతులోని మాధుర్యం పట్టుకపోయానో, పాటలోనిభావం పట్టుకపోయానో, ఊరిబయట ఆ పెద్ద మర్రిచెట్టు వద్దకు వెళ్ళేవరకూ తెలుసుకోలేకపోయాను.

నన్ను చూడగానే ఆమె తత్తరబడింది, బిత్తరిచూపులతో. కాని, తర్వాత ఆ అమాయకతా, ఆశ్చర్యమూ, విశ్వాసమూ గాయాలుపడి రక్తం కారుతూ— ముంగురులతో ముసురుకున్న ఆ సుందరవదనంలో, ఆ గడ్డం కొనలో, ఆ కనుబొమ్మలు కలుసుకోడంలో నాకు కనపడ్డాయి.

ఆ రక్తవస్త్రాలు చూచి నా శరీరం కంపించింది. కళ్లు గిర్రున తిరిగినాయి. ఆమెనుగురించి లేస్తున్న ప్రశ్నలు నా హృదయాన్ని కలవరపెట్టినాయి.

"ఆగాయా లెట్లా పడ్డాయి?" నే నన్నాను కొంచెం సానుభూతితో "ఏ జట్కా క్రిందయినా పడ్డావా?"

"లేదు బాబూ! నాప్రారబ్ధంకల్ల నేనే చేతులార చేసుకున్నాను" ఆమె మాటల్లో అణచుకున్న బాధా, దాచుకున్న విచారమూ కనబడుతున్నాయి.

నేను కొంచెం చకితుణ్ణయ్యాను "చేతులార చేసుకున్నవా! ఈ సౌందర్యంమీద ఇంత విరక్తి ఎందుకు కలిగింది?" అన్నాను.

"సౌందర్యం! ఈ సౌందర్యం పాడుభూయిష్ఠం బాబూ! ఈ సౌందర్యం, శోభా ఒకరిని భ్రమపెట్టి మరొకరి సంసారాలు కూలుస్తాయి, ప్రాణాలు తీస్తాయి, హాస్యాలు చేస్తాయి. ఇదివున్న బీదస్త్రీకి ఇక్కట్టులు తప్పవునాయనా! ఇవి ఉన్నంత కాలమూ ... నికి సౌఖ్యం, జీవితానికి ఆనందం వుండదు. ఈ దౌర్భాగ్యపుసౌందర్యం రెండుజీవుల్ని హరించిం-. ఇంకా వుంచుకుని ఏమి చేస్తాను" అన్నది కొంచెం విరక్తిగా.

నేను విచారంలో మారుమాట మాటలాడలేకపోయాను. కాని ఆమె పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలన్న కుతూహలంమాత్రం నన్ను వేధించింది.

"మీదేవూరు? నీకు మగదిక్కు లేదా? నువ్వు పిచ్చిదానివలె ఇట్లా ఊరూరు ఎందుకుగాలిస్తున్నావు?" అన్నాను కొంచెం కుతూహలంగా.

"తెలుసుకుని ఏంచేస్తావుబాబూ! నా జీవితం రక్తపాతం! అంధకారం!! తలుచుకుంటే హృదయం తరుక్కుపోతుంది." అని వూరుకున్నది. కాని నేను ఆమె ముఖంవైపే నిరీక్షిస్తూ కూర్చున్నాను ఆమె జీవితకథ వినాలని ఆశతో. నేను ఆమె ముఖంవైపు ఆశతో చూస్తూండటంచూచి అన్నది "ఈ పిచ్చిదాని కథవిని ఏం ఆనందిస్తావుబాబూ! ఈ దరిద్రగొట్టు జీవితంలో సుఖంగావున్న దినాలున్నాయా, వేదనలతో మునిగితేలిన రోజులేగాని!" అప్పటికి ఆమెహృదయంలోంచి పొరలుకొచ్చే విచారాధిక్యతతగ్గింది. నా హృదయంలో ఆశావిప్లవం చెలరేగింది. అప్పుడు ఆమె తన జీవితకథ చెప్పసాగింది.

## 2

"నేను రామవరం జమీలోని మామూలు రైతు కుటుంబంలో జన్మించాను. నాతండ్రి పేరు రామస్వామి. నా అయిదవఏటనే మాతండ్రిగారు జమీందారుగారి కోపజ్వాలలకి ఆహుతియయ్యారు. నాలాలనా—పాలనా, పెండ్లి—పేరంటాల భారమంతా నా తల్లిమీద పడింది. ఆమె నా వివాహంకోసం పడ్డశ్రమా, చేసినప్రయత్నాలు ఇన్నిన్ని కావు. ఎట్లాగైనా బిడ్డకు మంచి సంబంధం తీసుకురావాలని ఆశగా! ఆఖరికి ఆచుట్టుపట్లనంతా గాలించి, శోధించి, చివరికి రామవరం జమీలోనే చెదపాడు అను గ్రామంలో 'భద్రం' అనే ఆయనకిచ్చి నావివాహం చేసింది. ఆయనకల్లా కపటంలేనిమనిషి. నల్లని వన్నీనీరూ, తెల్లని వన్నీ పాలూ అనుకునే సరళహృదయుడు. కష్టసుఖాలన్నిటిలోనూ దేవుళ్లు—దైవాలూ, అదృష్టాలూ, కర్మలు అని నమ్మే పూర్వాచారపరాయణుడు.

"మామగారు చనిపోయేప్పుడు పదెకరాల గడ్డతోపాటు, ఆస్థానంలో శుభకార్యానికి ఘనానికి చదివించిన కట్నం బాపతు కొడుక్కి ఇంకా పది వందలు ముట్టజెప్పిపోయాడు ఋణం. అయినా అప్పటికి మా కుటుంబం; గొడ్డూగోడ్డతో తులతూగుతూవున్నది. నేను కాపరానికి వెళ్లినతర్వాత రెండుసంవత్సరాల

పాము పచ్చగానే వున్నది మా సంసారం. ఋణంమాత్రం చిల్లిగవ్వతీరలేదు, వడ్డీలకువడ్డీలతో రెట్లకురెట్లు పెరిగిపోతోందిగాని ఎట్లా తీరుతుంది? ఆ పదెకరాల గడ్డమీద పండేపంటా, వచ్చేఆదాయం జమీందారీసిబ్బంది మామూళ్లకూ, సర్కారు ఉద్యోగస్థుల లాంఛనాలకు పోగా మిగిలినది శిస్తుకే అస్తుబిస్తయ్యేది. తిండికి మళ్లా ఏనగో నాణ్యమో తాకట్టుపెట్టి తీసుకురావలసివచ్చేది.

"ఆసంవత్సరము పైరులు చాల బాగున్నాయి. వచ్చేపంటతో ఖర్చులుపోను మిగిలినదానితో కొంత ఋణం తీర్చుకోవచ్చని సంతోషించాం. కాని తలుచుకున్నదానికి వ్యతిరేకమైంది. మురుగువర్షాలతో పైరులన్నీ భూమట్టమయినాయి. సాలుపొడుగునా చెమటోడ్చి ఎముకలువిరిగేటట్లు చేసినశ్రమ మట్టిపాలయింది. తింటానికి దోసెడుగింజలుకూడా కరవైనాయి. పండినా ఎండినా తిండిమాత్రం తప్పదుగా! మిగిలిన 'నాను' కూడా అమ్మి తిండి గింజలు కొనుక్కున్నాం. పండలేదన్నమాటేగాని పండిన సంవత్సరంమాత్రం ఫలితం మాకు దక్కేదా! కష్టంమాత్రం చేజిక్కేది.

"ఇంకా శిస్తుతీరనేలేదు. పండినా, పండకపోయినా శిస్తుమాత్రం చెల్లిస్తూవుండాలి. మూడురోజులనుండీ 'ఇచ్చిపో! ఇచ్చిపో!!' అని ఇంటిచుట్టూ తిరుగుచున్నారు; వత్తిడిచేస్తున్నారు; బెదరిస్తున్నారు. ఏం పెట్టి తీర్చుతాం? ఉన్నవగకూడా వదిలించి తిండిగింజలుకొన్నాం. ఈసంవత్సరము పంటలన్నీ పాడైపోయినాయి, శిస్తుచెల్లించలేమని' విన్నవించుకున్నాము, కాళ్లావేళ్లాబడి బ్రతిమాలుకున్నాము జమీందారుగారిని. భోగవిలాసాలతో మునిగి తేలుతున్న ఆనిర్దయుడు పేదరైతుకష్టాలేమి గుర్తిస్తాడు! మామూలు ముట్టలేదని మామీద మండిపడుతున్న సముద్దారుమాటలు విని దోపిడిచేయించాడుగాని. కొట్టాలలో కట్టేసియున్న పశువులు కదలకపోతే బాదుకొంటూ బలవంతంగా తోలుకువెళ్లారు. ఆనిర్దయులు కొట్టేదెబ్బలకు అవి 'అంబా' అని అరచిన అరపులు దీనరోదనలై ఇంతవరకు నాహృదయంలో హోరుమ్రోగుతున్నాయి. ఆ నింపు చూడి యావు కదలలేకపోతే, వారు కొట్టినదెబ్బలకు తాళలేకచూసిన దీనదృష్టులు, ముక్కుల్లోంచి కారిన రక్తం..............."అని గద్గదకంఠమై పొరలుకొచ్చే దుఃఖాతిరేకాన్ని ఆపుకోలేకపోయింది.

"శిస్తుకొరత ఇంకా పూర్తిగాతీరనేలేదు. మరోవైపున పెట్టుబడిదారులు అప్పుకోసం వత్తిడిచేయసాగారు. ఏం తీరుస్తాం ఎండు డొక్కలతో? గోవుల ఆధారంకూడా పోయింది. అదిలేకుండా వ్యవసాయం చేయుటమే దుర్భరం. మళ్లా కొనే ఆశకూడా లేదు. ఋణంతీర్చే ఉపాయమూలేదు. ఇక వాళ్లకికూడా మరోవిధంగా వస్తుందనే ఆశపోయింది. ఆఖరికితిటతో దీవెనలతో వడ్డీ అసలు ఫాయిదాలక్రింద పొలంకాస్తా తీసుకున్నారు.

"అప్పటికి మా కింకెలాంటి ఆస్థీలేదు రెక్కల కష్టంతప్ప. ఇంట్లో జరుగుబాటు తక్కువైంది. ఆ వూళ్లోనే ఏకూలో—నాలోచేసుకుని జీవనం గడపాలనుకున్నాంగాని ఆత్మాభిమానం ఎదురుగా నిలబడి గేలి చేసింది. ఆఖరికి నాలుగురోజులపాటు ముఖం చాటు వేసుకోటానికి మాకన్నవారింటికి వచ్చాము. వారిది కూడా అంతగాఉన్న సంసారంగాదు. రెండునెలలపాటు చుట్టంచూపుతో మర్యాదగానే ఉన్నాము. ఎంతకాలమని పెడతారు! కొన్నాళ్లకి వారికికూడా స్థానంలేకపోయింది. మరో రెండునెలలపాటు జ్ఞాపకమున్నంతవరకూ బంధువులఇండ్లవద్దనే గడిపాము మర్యాద చెడకుండా. చివరికి మా మేనమామ సవతితల్లి తమ్ముడు గారింటికెళ్లాము. ఎరుగున్నంతవరకూ దగ్గరబంధువూ ఆఖరిబంధువూ వారే ననుకుంటాను.

"ఇక పొట్టపోసుకునే ఉపాయమేది? ఎరుగున్న బంధువులా లేరు. నౌకరీ దొరుకలేదు అని నా హృదయంలో చెప్పలేనిదిగులు ప్రారంభించింది. 'జమీందారుగారి కోపాలకీ, శాపాలకీ గురియైన ఈశరీరాలు, ప్రాణాలు, ఆత్మలు కుమిలికుమిలి జ్వాలలెత్తవలసిందేనా? వీటిని చల్లార్చే ఉపాయంలేదు?'

"మొదటినుండీ నేను నౌకరీకోసం కాయశక్తులా ప్రయత్నంచేస్తూనే వచ్చాను. మా ఆఖరిబంధువుగారింటివద్దయుండగా, వారింటిదరి మనిషి మేమంటే దయగా జాలిగా వుంటూవుండేవాడు. మా స్థితిగతులు తెలిసియుంటాయనుకుంటాను. ఒకనాడు స్థితంతా చెప్పి వినిపించాను. మా పరిస్థితులువిని అతను చాలా పరితాపపడ్డాడు. దరిద్రసాగరంలో మునిగి తేలుతున్న మమ్మల నొకదరి జేర్చాలని శతవిధాల ప్రయత్నించాడు. చిన్ననాటి స్నేహితుడైన మిల్లుమేనేజరుని బ్రతిమాలి 'వాని'కి నౌకరీ ఇప్పించాడు. ప్రయత్నిస్తే నాకు కూడా దొరికేదేగాని ప్రసవించే రోజులవటం వల్లమానుకున్నాను.

(సశేషము)